ద్విచక్ర వాహనాలు ఎక్కడ ఆపాలి?

విమానాశ్రయంలో అనుమతించని సిబ్బంది

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు అనుమతించకపోవడంతో పలువురు ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం పార్కింగ్ స్థలంలో ఇన్‌ఛార్జిగా ఉన్న సిబ్బంది ద్విచక్ర వాహనాలు నిలుపుకోవడానికి వీల్లేదని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆదేశాలు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) నుంచి జారీ కాలేదు. పార్కింగ్ సిబ్బంది ప్రయాణికులు, ఇతరులతో దురుసుగా ప్రవర్తించారు. వాహనాలను మెట్రో రైలు పార్కింగ్ స్థలంలో లేదా విమానాశ్రయ పరిపాలనా కార్యాలయం ఎదుట నిలుపుకోవాలని జవాబిచ్చారు. ఏఏఐ సిబ్బంది, పోలీసులు, సీఐఎస్ఎఫ్ ద్విచక్ర వాహనాలు మాత్రమే మల్టీ లెవల్ కార్ పార్కింగ్(ఎంఎల్‌సీపీ)లోకి అనుమతించారు.


విమానాశ్రయంలో పార్కింగ్ స్థలం

నిబంధనలు పాటించడంలేదని..

ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ స్టేషనులోని పార్కింగ్‌లో రద్దీ సమయంలో వాహనాలు నిండిపోయి ఉంటాయి. కొన్ని సమయాల్లో ఎంఎల్‌సీపీ కూడా కిక్కిరిసి ఉంటుంది. దాదాపు ఎనిమిదేళ్ల కిందట ఆటోలను అనుమతించకపోవడంతో మధ్య తరగతి ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ పలువురు ద్విచక్ర వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు సరిగా పాటించక పోవడంతోనే లోపలికి అనుమతించనట్లు పేర్కొన్నారు. విమానాశ్రయ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులందుతున్నాయన్నారు. త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

వరద కాలువల్లో రోబో యంత్రాలు

టన్నులకొద్దీ చెత్త తొలగిస్తున్న వైనం

వరదలకు ముందే పూడికతీత పనులకు సన్నాహాలు


రోబోటిక్ ఎక్స్‌కవేటర్

ఈశాన్య రుతుపవనాలు మొదలవక ముందే, వర్షాలు, వరదలు రాకముందే నగరంలో ముప్పును తొలగించేందుకు కార్పొరేషన్ ముందడుగు వేసింది. విదేశీ రోబో యంత్రాల్ని తెప్పించి మరీ పనులు చేపడుతోంది. వరద కాలువల్లో భారీ ఎత్తున పేరుకుపోయిన పూడికను అవి ఇట్టే తీసేస్తున్నాయి.


మైలాపూర్‌లో తుదిదశకు వరదకాలువ పనులు

ఈనాడు–చెన్నై

అందివచ్చిన అవకాశాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్(జీసీసీ) సద్వినియోగం చేసుకుంటోంది. వరద కాలువలను రోబోటిక్ ఎక్స్‌కవేటర్ల ద్వారా శుభ్రపరుస్తున్నారు. తాజాగా యూరప్ నుంచి వాటిని కొనుగోలు చేశారు. ఇదివరకే జీసీసీ దగ్గర ఇలాంటివి 4 యంత్రాలుండగా.. స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.12.97 కోట్లతో అదనంగా రెండు రోబోటిక్ ఎక్స్‌కవేటర్ యంత్రాలు కొనుగోలుచేశారు. వాటి 5ఏళ్ల నిర్వహణకు రూ.9.82 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. చిన్న, పెద్ద కాలువలన్న తేడా లేకుండా అందులోని పూడిక తొలగిస్తున్నాయి. 3.5 మీ ఇరుకు కాలువల్లో సైతం దిగుతున్నాయి. చక్రాలతో వెళ్లలేని చోట్ల ఇనుప కాళ్లతో ముందుకు నడుస్తూ పూడిక పెకలిస్తున్నాయి. లోతుగా పేరుకుపోయినవాటిని కూడా తొలగించేలా ఇవి తమ కాళ్లను అనుసంధానించుకుని పనులు చేస్తుండటం ఆకట్టుకుంటోంది. కాలువల సైజును అనుసరించి టైర్ల అమరికను మార్చుకోవడం వాటి ప్రత్యేకత.


ఇరుకు కాలువలో పూడిక తీస్తున్న యంత్రం

వేగంగా ముందుకు..

నగరంలోని చాలా ప్రాంతాల్లోని వరద కాలువల్లో పూడిక తీసేందుకు ఈ యంత్రాలు వాడుతున్నారు. జోన్-4లో జవహర్ కెనాల్ 750 మీ. పొడవుంటుంది. ఇందులో నుంచి సుమారు 300 టన్నుల చెత్తను బయటికి తీశాయి. 1350 మీ. వ్యాసర్పాడి కెనాల్‌లో పూర్తిస్థాయిలో పూడికతీసే పనిలో ఉన్నాయి. సోమవారానికి 61 టన్నుల చెత్తను బయటికి తీశారు. గతేడాది వరదల్లో తీవ్రంగా ఇబ్బంది పెట్టిన రాయపురం వరదనీటి కాలువలను ఈసారి వాటితోనే ప్రక్షాళన చేస్తున్నారు. ఈ జోన్‌లోని 15 వార్డుల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో కాలువల మరమ్మతులు చేపడుతున్నారు. బకింగ్‌హామ్ కెనాల్‌లో పూడికతీత పనులు వేగవంతం చేస్తున్నారు. ఇలా చాలాచోట్ల వాటిని వాడుతున్నారు. మరోవైపు నగర పరిధిలోని చెరువులు, కుంటల్లాంటి జలవనరుల్లోనూ రోబోటిక్ ఎక్స్‌కవేటర్ల ద్వారానే పూడికతీసి వర్షాలకు సిద్ధం చేస్తున్నారు. అంబత్తూరు సర్‌ప్లస్ కెనాల్‌లో పూడికతీత కార్యక్రమాలు దాదాపు కొలిక్కి వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

డ్రోన్లతో పర్యవేక్షణ

వరదనీటి కాలువల్లో చాలాచోట్ల అక్రమంగా చెత్తాచెదారాలు వేసే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ చర్యల్ని జీసీసీ అరికట్టలేకపోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా వరదనీటి కాలువల్లో చెత్తాచెదారాల్ని గుర్తించేందుకు అధికారులు డ్రోన్లు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర చెన్నైలోనూ పర్యవేక్షించడం మొదలుపెట్టారు. 30 కి.మీ. కాలువల్ని పరిశీలించి పలు ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తున్నవారిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా కొడుంగైయూర్ కెనాల్ మీదుగా డ్రోన్ల ద్వారానే సర్వే నిర్వహించారు. నగరంలోని కాలువల్లో వ్యర్థాలు పడేయకుండా పలుచోట్ల ఇనుప గ్రిల్స్ కాలువలకు అడ్డుగా వేస్తున్నారు.


డ్రోన్ వదులుతున్న జీసీసీ సిబ్బంది

గుజరాత్ నుంచి..

రోబోటిక్ యంత్రాలతో పాటు మరిన్ని ఆధునాతన యంత్రాల్ని జీసీసీ తెప్పించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి పలు యంత్రాల్ని అద్దెకు తెచ్చారు. వాటిని డ్రెయిన్‌మాస్టర్‌గా పిలుస్తున్నారు. వరద కాలువలు, కెనాల్స్, జలవనరుల్లో పూడికతీతకు వాటిని వాడుతున్నారు. ఈ మధ్యే వీటిని కెప్టెన్‌కాటన్ కెనాల్‌లో వినియోగించి 4.4 మీ. లోతుమేర పూడిక తీశారు. పలుచోట్ల భూగర్భ వరద కాలువల్లో ఇరుక్కుపోయిన చెత్తాచెదారాల్ని, ఇతర వ్యర్థాల్ని తీసేందుకు సక్షన్ కమ్ జెట్ యంత్రాల్ని వాడుతున్నారు. ఈ యంత్రం లోపలున్న చెత్తను బలవంతంగా తీస్తున్నట్లు అధికారులు తెలిపారు. పలుచోట్ల సిబ్బంది ద్వారానూ పూడిక తీయిస్తున్నారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు!



ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నాలుగు డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. పశ్చిమగాలి వేగంలో మార్పు కారణంగా 29 వరకు రాష్ట్రంలో ఒకటి, రెండుచోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సెప్టెంబరు 30, అక్టోబరు 1న తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొన్నిచోట్ల గురువారం రెండు నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని తెలిపింది. చెన్నై శివారు ప్రాంతాల్లో రాబోయే 48 గంటలకు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

త్రైమాసిక పరీక్షల సెలవులు పొడిగింపు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ప్లస్‌టూ వరకు త్రైమాసిక పరీక్షలు జరుగుతున్నాయి. 27కు ముగియనున్న నేపథ్యంలో 28 నుంచి అక్టోబరు 2 వరకు ఐదురోజులపాటు సెలవులు ఇస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ గతంలో ప్రకటించింది. జవాబుపత్రాల మూల్యాంకనం, ఫలితాల తయారీకి సెలవులను పొడిగించాలని ఉపాధ్యాయులు కోరారు. వారి వినతిని స్వీకరిస్తు అక్టోబరు 6 వరకు సెలవులు పొడిగిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. 7న పాఠశాలలు ప్రారంభమవుతాయని తెలిపింది.

విద్యార్థుల భవితలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇంజినీరింగ్ ఇతర కోర్సుల్లోనూ రిజర్వేషన్ అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రంగసామి తెలిపారు. పుదుచ్చేరి ఇందిరానగర్‌లోని ఇందిరాగాంధీ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తలచుకుంటే విద్యార్థులను విద్యావేత్తలుగా, ఆవిష్కర్తలుగా మార్చి చూపగలరని చెప్పారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను సరిగా అర్థం చేసుకొని విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు. పాఠశాల దశలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. అందుకే పాఠశాల విద్యకు అధిక నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయుల పోస్టులు త్వరలో భర్తీ చేస్తామన్నారు.

కేంద్ర పభుత్వ ఉద్యోగులకు ఉచిత చికిత్స

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: గిండిలోని కలైఞర్ సెంటినరీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్తగా మూడు ఎలక్ట్రికల్ వాహనాలను ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.500కోట్లతో నిర్మించిన ఆస్పత్రిని ఏడాదిన్నర కిందట ప్రారంభించామని ఇప్పటివరకు 3,37,275 మంది రోగులకు చికిత్స అందించామన్నారు. ఆసుపత్రిలో ఎంపీలు, న్యాయమూర్తులు, కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు ఉచితంగా చికిత్స పొందేలా కేంద్రప్రభుత్వ హెల్త్‌స్కీమ్‌ను అనుసంధానిస్తు నేడు అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.



ప్రముఖ రాజకీయ వేత్త, భారతీయ జనసంఘ్ దివంగత నేత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గిండి రాజ్‌భవన్‌లో బుధవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పిస్తునన గవర్నర్ ఆర్.ఎన్.రవి

-చెన్నై, న్యూస్‌టుడే

టాస్మాక్ దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా విక్రయాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: టాస్మాక్ దుకాణాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా విక్రయాలు మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టాస్మాక్ దుకాణాల్లో మద్యం అధిక ధరకు విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. అందుకు పరిష్కారంగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ రూపంలో నగదు చెల్లించి, బిల్లు పొందే వీలును టాస్మాక్ కొద్దినెలలుగా కల్పిస్తోంది. మొదటి విడతగా ఈ విధానం రాణిపేట జిల్లా, రామనాథపురంలో ఏడు చొప్పున దుకాణాల్లో బుధవారం నుంచి ప్రారంభించింది. టాస్మాక్ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. మొదటి విడతగా రెండు జిల్లాల్లో మొదలుపెట్టామని, వచ్చే అభిప్రాయాల ఆధారంగా ఒకటి, రెండు నెలల్లో అన్ని టాస్మాక్ దుకాణాల్లో అమలు చేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,800 దుకాణాలు ఉన్నాయని, అన్నింటినీ కంప్యూటరీకరణ చేయడంతో అధికారులు నిల్వలను పర్యవేక్షించడం, తనిఖీ చేయడానికి వీలు కలుగుతుందన్నారు.

చదరంగ విజేతలకు ప్రోత్సాహక నగదు

చెన్నై, న్యూస్‌టుడే: చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణ పతకాలు పొందిన రాష్ట్రానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు, జట్టు కెప్టెన్‌కు ప్రోత్సాహక నగదుగా రూ.90 లక్షల బ్యాంకు చెక్కులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందించారు. క్యాంపు కార్యాలయంలో క్రీడాకారులు గుకేశ్, ప్రజ్ఞానంద, వైష్ణవికు రూ.25లక్షలు చొప్పున, జట్టు కెప్టెన్ శ్రీనాథ్ నారాయణన్‌కు రూ.15లక్షల బ్యాంకు చెక్కును సీఎం బహూకరించారు. గ్లోబల్ చెస్ లీగ్ పోటీల్లోనూ గెలిచి దేశానికి గర్వకారణం కావాలని కోరారు. మంత్రి ఉదయనిధి, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి మేఘనాథరెడ్డి, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చదరంగ క్రీడాకారులు

త్వరలో టోల్‌గేట్ల వద్ద టీఎన్‌సీసీ ఆందోళన

సెల్వ పెరుంతగై

చెన్నై, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రజా విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా త్వరలో టోల్‌గేట్ల వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై తెలిపారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో... టోల్‌గేట్ల ఛార్జీలను 5 నుంచి 7శాతం పెంచనున్నట్లు జూన్‌లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రకటించిందన్నారు. టోల్‌గేట్లలో సుదీర్ఘకాలంగా ఛార్జీలను ఏ ప్రాతిపదికన వసూలు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. వాహన చోదకుల వద్ద టోల్‌ఛార్జీలు పేరిట పగటి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 70 టోల్‌గేట్ల వద్ద ఆయా జిల్లాల పార్టీ కమిటీల తరపున ఆందోళనలు నిర్వహిస్తారన్నారు.

మోదీ వ్యూహాలు రాష్ట్రంలో ఫలించలేదు: ఉదయనిధి

చెన్నై, న్యూస్‌టుడే: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో డీఎంకే కూటమి తిరుగులేని విజయం సాధించడానికి ప్రధాని మోదీ కారణమని ఆ పార్టీ యువజన విభాగం కార్యదర్శి, మంత్రి ఉదయనిధి తెలిపారు. నగరంలోని రాజా అన్నామలై హాలులో డీఎంకే చెన్నై తూర్పు జిల్లా తరపున మంగళవారం సాయంత్రం జరిగిన పార్టీ వజ్రోత్సవాల్లో ఉదయనిధి పాల్గొన్నారు. 75 ఏళ్లకు పైబడిన పార్టీ నిర్వాహకులకు పొర్కిళి, ధ్రువపత్రం, జ్ఞాపికలు అందించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సుమారు రూ.50 కోట్లకు పైగా పార్టీ సీనియర్ నిర్వాహకులకు పొర్కిళి అందించారని పేర్కొన్నారు. పార్టీ నిర్వాహకులు, కార్యకర్తల శ్రమ పార్టీకి విజయాలు అందిస్తోందని గుర్తు చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓ కారణమన్నారు. రాష్ట్రంలో వరదలు, భారీవర్షాలు, తుపాను వచ్చినప్పుడు బాధిత ప్రాంతాల సందర్శనకు రాని ప్రధాని ఎన్నికలు ప్రకటించిన తర్వాత రెండునెలల్లో 8 సార్లు వచ్చి వెళ్లారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగిసినా కన్నియాకుమరిలోని వివేకానంద మఠంలో ధ్యానం చేశారని, ఆయన వ్యూహాలు రాష్ట్రంలో ఫలించలేదని పేర్కొన్నారు. 2026 శాసనసభ ఎన్నికల్లోనూ డీఎంకే ఘనవిజయం సాధించేందుకు అందరూ శ్రమించాలని పిలుపునిచ్చారు.


సహాయాలు అందిస్తున్న ఉదయనిధి

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

మాజీ మంత్రి సంపత్

సైదాపేట, న్యూస్‌టుడే: ఉత్తుత్తి మాటలు మాట్లాడకుండా డీఎంకే ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నాడీఎంకే మాజీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంసీ సంపత్ డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి విడుదల చేసిన ప్రకటనలో.. తమ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి పెట్టుబడులపై నిలదీయగా డీఎంకే పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా పొంతన లేని సమాధానాలు ఇచ్చారని అన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు చెప్పారని, ఏఏ సంస్థలు ఎంత వెచ్చించాయి, ఎక్కడెక్కడ పరిశ్రమలు స్థాపించాయి, ఎంత మందికి ఉపాధి లభించిందనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.



నివాళులర్పిస్తున్న అభిమానులు

ఎస్పీబీకి ఘన నివాళి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతి సందర్భంగా అభిమానులు నివాళులర్పించారు. తిరువళ్లూరు సమీప తామరైపాక్కం కూడలి రోడ్డులోని ఆయన సమాధి వద్ద బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. చెట్టును ఢీకొన్న వ్యాను

ఆరుగురి దుర్మరణం


ప్రమాదానికి గురైన వ్యాను

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై జిల్లా ఆరణి వాళైపందల్ సమీపంలోని మాంబాక్కం గ్రామానికి చెందిన 20 మంది వ్యానులో తిరుచ్చెందూర్ మురుగన్ ఆలయానికి వెళ్లి దర్శనం అనంతరం మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం వేకువజామున కళ్లకురిచ్చి జిల్లాలో చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో మేట్టత్తూర్ వద్ద వెళుతుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఇద్దరు మహిళలు సహా ఆరుగురు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న తిరుక్కోవిలూర్ పోలీసులు, ఉళుందూర్‌పేట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన 14 మందిని తొలుత కళ్లకురిచ్చి ప్రభుత్వ వైద్యవిద్య ఆసుపత్రికి అనంతరం విళుపురం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారిలో సుమారు గంట సమయం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిరుక్కోవిలూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విళుపురం ముండియంబాక్కం ఆసుపత్రిలో సిబ్బంది మృతదేహాలను తీసుకోవడానికి నిరాకరించారు. మృతి చెందిన వారు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారని, ఘటనాస్థలం కళ్లకురిచ్చి జిల్లా పరిధిలో ఉన్నందున మృతదేహాలకు కళ్లకురిచ్చి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించాలన్నారు. ఆ మేరకు మృతదేహాలను అక్కడికి తరలించారు. మృతుల పేర్లు, వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


నష్టాలు వచ్చాయని.. వ్యాపారి కుటుంబం ఆత్మహత్య

విషం తాగి.. కారులో అయిదుగురి బలవన్మరణం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వ్యాపారంలో నష్టం రావడంతో ఓ వ్యాపారి కుటుంబంతోపాటు బలవన్మరణానికి పాల్పడ్డారు. పుదుక్కోట్టై సమీపంలోని నముననసముద్రం ప్రాంతంలో నగర శివమఠానికి మంగళవారం సాయంత్రం ఓ కారు వచ్చింది. అందులో ఐదుగురు ఉన్నారు. వారు కాసేపు బయట తిరగడాన్ని స్థానికులు గమనించారు. బుధవారం ఉదయం చాలాసేపైనా కారు అక్కడి నుంచి కదల్లేదు. అనుమానం వచ్చి స్థానికులు దగ్గరకెళ్లి చూడగా వాహనంలో ఐదుగురు విగతజీవులుగా పడి ఉండటం గుర్తించారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వారిని సేలం జిల్లా ఆత్తూర్‌కు చెందిన వ్యాపారి మణికంఠన్(50), ఆయన భార్య నిత్య(48), తల్లి సరోజ(70), కుమారుడు ధీరన్(20), కుమార్తె నిహారిక(22)గా గుర్తించారు. ఓ లేఖను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో బలన్మరణానికి పాల్పడుతున్నట్లు అందులో రాసి ఉంది. 15ఏళ్లుగా సేలంలో ఉంటున్న మణికంఠన్ సేలం, కృష్ణగిరి, నామక్కల్‌లో మెటల్ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనాస్థలంలో కారు

బి.లిట్ చేసినవారికి ఉపాధ్యాయ ఉద్యోగాలివ్వాలి: రామదాస్



సైదాపేట, న్యూస్‌టుడే: అన్నామలై విశ్వవిద్యాలయంలో బి.లిట్ పూర్తి చేసిన వారికి ఉపాధ్యాయ ఉద్యోగాలు ఎందుకు నిరాకరిస్తున్నారని పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ ప్రశ్నించారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో గ్రాడ్యుయేట్ టీచర్ల పోస్టుల భర్తీకి 518 మందిని ఎంపిక చేశారన్నారు. 164 మంది ఉత్తీర్ణత తాత్కాలికంగా ఆపేస్తున్నట్లు ఉపాధ్యాయ పరీక్షల బోర్డు ప్రకటించిందని తెలిపారు. వారంతా చిదంబరం అన్నామలై యూనివర్సిటీలో బి.లిట్ పట్టా పొందినవారని అన్నారు. ఇది బీఏ తమిళ సాహిత్యానికి సమానమైనది కాదని బోర్డు తెలిపిందన్నారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమైందని తెలిపారు. వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడి ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధించాలి: మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: పాఠశాల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడానికి నిషేధం విధించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. పాఠశాలల వద్ద కూల్‌లిప్ తదితర పొగాకు ఉత్పత్తులు విక్రయించడానికి నిషేధం విధించాలని మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలైంది. విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేసే గుట్కా, కూల్‌లిప్‌లాంటి వాటిని నిషేధించాలని కోరారు. పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై ధర్మాసనం మొదటి విడతగా పాఠశాల ప్రాంగణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడానికి దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని సూచించింది. గుట్కా, నిషేధిత వస్తువుల తయారీ సంస్థలకు కఠిన నిబంధనలు విధించాలని పేర్కొంది. పొగాకు ఉత్పత్తుల విక్రయంపై చట్టంలో సవరణలు తీసుకొచ్చే విషయమై జవాబు పిటిషన్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది.



మాట్లాడుతున్న తిరుమావళవన్

డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్య లేదు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: డీఎంకే కూటమిలో ఎలాంటి సమస్యలేదని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ స్పష్టం చేశారు. కోయంబత్తూరు విమాశ్రయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో అనేక సమస్యలున్నాయని, వాటిన్నింటిని పక్కనపెట్టి ప్రతిపక్షాలు డీఎంకే కూటమిపై మాట్లాడంలో అర్థం లేదన్నారు. స్వార్థ ప్రయోజనల కోసం, మీడియాలో కనిపించాలని కొందరు నేతలు అనవసరంగా రాద్ధాంతం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన ప్రజా సమస్యలపై మాట్లాడకూడదనే చట్టం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు.

(c) eenadu



కార్యక్రమంలో పాల్గొన్న కామకోటి, ఇందిరాదత్ తదితరులు

సాంకేతికతతో గ్రామాల్లోనూ ప్రగతి

టీనగర్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లోనూ సాంకేతికత ఉపయోగించి అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరముందని ఐఐటీఎం డైరెక్టర్ కామకోటి పేర్కొన్నారు. ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఏసీసీ) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన రసిక్‌లాల్ ఎం మెహతా స్మారక ఉపన్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత అందిపుచ్చుకోవడం ద్వారా ఏ రంగంలోనైనా ప్రగతి సాధించవచ్చన్నారు. రాష్ట్రంలోని గ్రామాల్లో సుమారు 200 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభను వెలికి తీసే దిశగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత కొత్త ఆలోచనలతో అభివృద్ధి మార్గంలో పయనించాలని కామకోటి పిలుపునిచ్చారు. నిపుణుల సలహాలు అవసరమని ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వి.ఎల్.ఇందిరాదత్ తన స్వాగతోపన్యాసంలో తెలిపారు. రసిక్‌లాల్ ఎం మెహతా వారసులు తన తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.10 లక్షల మొత్తాన్ని విరాళంగా అందించారు. ఏసీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐఐటీఎం ఆచార్యులకు అత్యున్నత పురస్కారం



ఆచార్యులు రవీంద్ర గెట్టు

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం) ఆచార్యులు రవీంద్ర గెట్టుకు ఆర్‌ఎల్‌ఈఎం అనుబంధ సంస్థ ఇంటర్నేషనల్ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ సంస్థ అత్యున్నత పురస్కారం లభించింది. 2018-21 కాలంలో ఆయన ఈ సంస్థకు అధ్యక్షుడిగా పని చేశారు. 78 ఏళ్ల చరిత్ర కలిగిన సంస్థలో మొదటి ఏకైక ఆసియా దేశస్థుడిగా సేవలందించారు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిర్మాణ రంగానికి కావాల్సిన పరిశోధనలను ఒకచోటుకు చేర్చింది.

500 కి.మీ. సొరంగాలు.. ఫైబర్ రీఇన్‌ఫోర్స్డ్ కాంక్రీట్(ఎఫ్‌ఆర్సీ)కి సంబంధించిన సాంకేతిక అభివృద్ధి, అమలును ఐఐటీఎంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు వీఎస్ రాజు మార్గదర్శకత్వంలో రవీంద్రగెట్టు నిర్వర్తించారు. పదేళ్లలో భారత్‌లో ఎఫ్ఆర్సీ పరిశీలించేందుకు 30 పరిశోధనశాలలతో 500 కి.మీ. సొరంగాలను ఫైబర్ రీఇన్‌ఫోర్స్డ్ కాంక్రీట్‌తో నిర్మించారు. కరోనా సమయంలో ఒత్తిడి ఉన్నా, దూరప్రాంతాల్లోని వారితో మాట్లాడేందుకు సోషల్ మీడియా, ఆన్‌లైన్ సమావేశాలు, ఖర్చులు తట్టుకోలేని పరిశోధకులకు బాగా సహకరించాయని రవీంద్రగెట్టు తెలిపారు. ఆయన కోయంబత్తూరులోని టెక్నాలజీ ప్రభుత్వ కళాశాలలో బీఈ(ఆనర్స్)చదివి మద్రాసు వర్సిటీ నుంచి 1984లో సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. మిల్వాకీలోని మార్క్వెట్టే వర్సిటీ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2004లో ఐఐటీ మద్రాస్‌లో ఆచార్యులుగా చేరారు.

ఆస్తుల రక్షణకు అధునాతన స్కానర్లు

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏర్పాటు

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భూములు కొనుగోలు చేసిన వారిని మోసపూరిత రిజిస్ట్రేషన్ నుంచి రక్షణ కల్పించేందుకు అధునాతన సాంకేతిక విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ లెవల్-1 ఫింగర్‌ప్రింట్ స్కానర్లు ఏర్పాటు చేసింది. ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్(ఏఈపీఎస్), నకిలీ వేలిముద్రలతో పట్టాలు(సేల్ డీడ్) తీసుకునేందుకు, ఆర్థిక మోసాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టింది.

ఆధార్‌తో పరిశీలించి..

రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 15వేల పత్రాలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదవుతున్నాయి. 582 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 50 వేల వేలిముద్రలు ప్రమాణీకరించారు. ఆధార్, ఈకేవైసీతో పత్రాలను రిజిస్ట్రేషన్ సమయంలో వేలిముద్ర స్కానర్లు వినియోగిస్తోంది. భూమి కొనుగోలు చేసిన వ్యక్తి వేలిముద్ర కార్యాలయంలో నమోదై ఉంటుంది. కొన్నేళ్ల తర్వాత అమ్ముకునే సమయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చినపుడు వేలిముద్రలు పరిశీలిస్తారు. సరిగా లేనిపక్షంలో ఆధార్‌తో పరిశీలిస్తామని రిజిస్ట్రేషన్ విభాగ సీనియర్ అధికారి ఒకరన్నారు.

సాధారణంగా రిజిస్ట్రేషన్ విభాగం 'లెవల్ 0 స్కానర్లు' వినియోగిస్తోంది. కొనుగోలుదారుల ఆస్తుల భద్రత దృష్ట్యా యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) 'ఎల్ 1' స్థాయితో కూడిన వేలిముద్ర స్కానర్లను తప్పనిసరి చేసింది. యూఐడీఏఐ సూచన మేరకు పరికరాలు సిద్ధం చేసి వాటిని అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిణీ చేశారు. 'ఎల్ 1' స్కానర్లు మెరుగైన స్థాయి, భద్రతతో కూడుకుందని, వేలిముద్ర అసలైన వ్యక్తిదా లేక మరొకరిదా అనేది తెలుస్తుందని అధికారి ఒకరన్నారు.

నిశితంగా గమనించాలి..

ప్రభుత్వం తీసుకుంటున్న కొత్త చర్యలపై పలువురు స్థిరాస్తి సలహాదారులు హర్షం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ కోసం క్లెయిమ్ చేయని ఆస్తులేమైనా ఉంటే వాటిని నియంత్రించే వీలుఉంటుంది. కొనుగోలుదారులకు కూడా ఉపయోగమేనని, అధికారులు నిశితంగా గమనించాలని సీఎంఓపీ, టీటీసీపీ, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) కమిటీ చైర్మన్ ఎస్.రామ్‌ప్రభు అన్నారు.



కలాం స్మారకానికి అదనపు స్థలం ఉత్తర్వుపై స్టే

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: అబ్దుల్ కలాం స్మారక నిర్మాణానికి అదనంగా స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం స్టే విధించింది. రామనాథపురం జిల్లా పేక్కరుంబుకి చెందిన శివరామకృష్ణన్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌లో.. పాంబన్ గ్రామం పేక్కరుంబులో శ్మశానం వర్గీకరించిన ప్రాంతంలోని ఓ భాగంలో అబ్దుల్ కలాం స్మారకాన్ని ఏర్పాటు చేశారన్నారు. మిగిలిన ప్రాంతంలో మాడసామి ఆలయం, తెప్పకుళం, సునామీ నివాసాలు, కమ్యూనిటీ హాలు ఉన్నాయన్నారు. గత జూన్‌లో రెవెన్యూ అధికారులు మాడసామి ఆలయాన్ని తొలగించడానికి యత్నించారన్నారు. అబ్దుల్‌కలాం స్మారకం కోసం కేంద్ర ప్రభుత్వానికి అప్పగించినట్లు అధికారులు తెలిపారన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఉత్తర్వు జారీ చేసినట్లు తెలిసిందన్నారు. ఇందుకు పాంబన్ ప్రజలు ఆమోదం తెలిపినట్లు, తంగచ్చిమడం పంచాయతీలో తీర్మానం చేసినట్లు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి అవాస్తవ నివేదిక దాఖలు చేశారన్నారు. ఈ పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. న్యాయమూర్తులు.. కలాం స్మారకం కోసం కేటాయించేటప్పుడు ఆ ప్రాంతంలో మాడసామి ఆలయం, తెప్పకుళం, సునామీ నివాసాలు, సామాజిక భవనాన్ని కలుపుతూ జీవో జారీ అయిందని, అందుకు స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు ఇచ్చారు. రామనాథపురం కలెక్టరు జవాబు పిటిషన్ దాఖలు చేయాలని తెలిపి విచారణను వాయిదా వేశారు.

తిరుమల లడ్డూపై వ్యంగ్య వీడియో

యూట్యూబ్ నుంచి తొలగించిన పరితాపంగళ్ గ్రూప్

వేళచ్చేరి: అత్యంత పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారన్న విషయం భక్తులను విస్మయానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో పలు రకాల వీడియోలు, సందేశాలు, మీమ్స్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుమల లడ్డూ పాపాలు పేరిట పరితాపంగళ్ యూట్యూబ్ ఛానెల్ వీడియో విడుదల చేసింది. లడ్డూలో ఆవు కొవ్వు కలిపిన సమాచారం తెలుసుకొని శాఖాహారుల్లో స్పందన ఎలా ఉంటుంది, బీఫ్ తినే వాళ్లు ఎలా స్పందిస్తారు, తితిదే భక్తులకు కల్తీ లడ్డూ అందించడం ఎంత వరకు సమసంజసం అనే కోణంలో హాస్య మిళితమైన దృశ్యాలు అందులో ఉన్నాయి. శాఖాహారం మాత్రమే భుజించే వ్యక్తి మాంసాహారాన్ని ఎగతాళిగా చూస్తూ దూరంగా నెట్టేయడం , లడ్డూ ప్రసాదమైనా చాలామంది కలిసి తయారు చేయడంతో కొందరు తినడానికి నిరాకరించడం వంటి దృశ్యాలు కూడా కనిపిస్తున్నాయి. ఈ వీడియోను పరితాపంగళ్ గ్రూప్ హఠాత్తుగా యూట్యూబ్ నుంచి తీసేయడంతో సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది. హాస్యం కోసం చిత్రీకరించామని, ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదని, కొంతమంది మనస్తాపం చెందడంతో తొలగించామని గ్రూప్‌నకు చెందిన గోపి, సుధాకర్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పు జరగదని తెలియజేశారు. ఇప్పటికే ఈ వీడియోను అనేక మంది డౌన్‌లోడ్ చేసుకోవడంతో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



గోపి, సుధాకర్

పర్యటనలతో మనసుకు ఆహ్లాదం

వడపళని, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినాన్ని(వరల్డ్ టూరిజం డే) పురస్కరించుకుని పాండిచ్చేరి వర్సిటీలో రెండు రోజులపాటు ఉపకులపతి, ఆచార్యులు కె.తరనిక్కరసు నేతృత్వంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పుదుచ్చేరి ప్రభుత్వ కళల విభాగ డైరెక్టరు వి.కల్లియపెరుమాళ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాలకు వెళితే కొత్త ప్రదేశాల గురించి తెలుసుకోవడంతో పాటు మనసుకు ఆహ్లాదం కలుగుతుందని తరనిక్కరసు అన్నారు. జిప్‌మర్, పుదుచ్చేరి రోటరీక్లబ్‌తో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. టూరిజం ది లాంగ్వేజ్ ఆఫ్ పీస్ నినాదంతో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



ప్రసంగిస్తున్న తరనిక్కరసు

కుయిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేచర్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది. వర్సిటీ స్కూల్ మేనేజ్‌మెంట్ డీన్, ఆచార్యులు మలబిక డియో, విద్యార్థి విభాగ డీన్, ఆచార్యులు వై.వెంకటరావు, పుదుచ్చేరి పర్యాటక విభాగం, వర్సిటీ అధ్యాపకులు, పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వెళ్లొద్దు.. మేడం

- ఉపాధ్యాయిని బదిలీ
- కన్నీరు పెట్టుకున్న విద్యార్థులు



రోదిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయిని

అరక్కోణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయిని బదిలీని విద్యార్థులు తట్టుకోలేకపోయారు. కన్నీటితో వీడ్కోలు పలికారు. రాణిపేట జిల్లా రాణిపేట భెల్ టౌన్‌షిప్ ఆవరణలో ప్రభుత్వ నిధుల సాయంతో ప్రాథమిక పాఠశాల కొనసాగుతోంది. సంతానలక్ష్మి అనే ఉపాధ్యాయిని 17 ఏళ్లుగా పని చేస్తున్నారు. అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తుండటంతో విద్యార్థులందరికీ ఆమె అంటే చాలా ఇష్టం. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో సంతానలక్ష్మిని విద్యాశాఖ అధికారి మరో పాఠశాలకు బదిలీ చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు తమను విడిచి వెళ్లకూడదని పట్టుబట్టారు. ప్రేమతో ఆమెను బంధించారు. విద్యార్థుల ప్రేమ బంధాన్ని చూసి ఆమె కన్నీరు పెట్టుకున్నారు. ఇది చూపరులను కంటతడి పెట్టించింది.

ఎడప్పాడి పళనిసామి పిటిషన్‌పై తీర్పు వాయిదా

ప్యారిస్, న్యూస్‌టుడే: ఎంపీ దయానిధి మారన్ దాఖలు చేసిన పరువునష్టం దావా కేసులో నేరుగా హాజరయ్యేందుకు మినహాయింపు కోరిన ఎడప్పాడి పళనిసామి పిటిషన్‌పై తీర్పును ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సెంట్రల్ చెన్నై డీఎండీకే అభ్యర్థి పార్థసారథికి మద్దతుగా ప్రచారం చేసిన ఎడప్పాడి పళనిసామి.. ఎంపీ దయానిధి మారన్ నియోజకవర్గ అభివృద్ధి నిధి సక్రమంగా ఖర్చు చేయలేదని ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై దయానిధి మారన్ పరువునష్టం దావా దాఖలు చేశారు. ఇది బుధవారం ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చింది. దయానిధి మారన్ హాజరవలేదని, విచారణ వాయిదా వేయాలని ఆయన తరపు లాయరు కోరారు. ఎడప్పాడి పళనిసామి తరపున కేసు నుంచి విడుదల చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ విచారణకు తగినది కాదని దయానిధి మారన్ తరపు లాయరు వాదించారు. విచారణకు హాజరయ్యేందుకు మినహాయింపు ఇవ్వాలని ఎడప్పాడి పళనిసామి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు పూర్తయిన నేపథ్యంలో తీర్పును అక్టోబరు 16కి వాయిదా వేశారు.

ఊటీ అనాథాశ్రమంలో అవినీతి

విచారణకు కమిటీ ఏర్పాటు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సమీపంలోని ముల్లిక్కరై ప్రాంతంలో తమిళనాడు పట్టణ జీవనోపాధుల కల్పన సంస్థ తరపున అబ్దుల్ కలాం అనాథాశ్రమ నడుస్తోంది. మున్సిపల్ భవనంలో కొనసాగుతున్న ఆశ్రమ నిర్వహణకు పాలకవర్గం తరపున నగదు ఇస్తున్నారు .ఇక్కడ సుమారు 80 మంది వరకు ఆశ్రయం పొందుతున్నారు. కొద్ది నెలలుగా మృతి చెందుతున్న వృద్ధుల సంఖ్య పెరుగుతోందని, ప్రభుత్వాధికారుల అనుమతి పొందకుండా నిర్వాహకులు మృతదేహాలను దహనం లేక ఖననం చేస్తున్నట్లు ఫిర్యాదులు తలెత్తాయి. వారి ఆస్తులు, బ్యాంకు ఖాతాల్లోని పొదుపు, బంగారు ఆభరణాలు మాయమవుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. వృద్ధులపై దాడులకు పాల్పడటం, వేధించడం, నేలపై పడుకోవడంలాంటి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం(23న) కలెక్టరేటక్ష నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో నామ్ తమిళర్‌కట్చి సభ్యుడు సెల్వ ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ లక్ష్మీభవ్య మాట్లాడుతూ. . ఆశ్రమంలో అవినీతిపై విచారణకు ముగ్గురితో కమిటీని నియమించామని, వారం రోజుల్లో నివేదిక అందుతుందని చెప్పారు. కమిటీ మంగళవారం ఆశ్రమంలో విచారణ చేపట్టింది. పూర్తయ్యాక నివేదిక అందిస్తామని బృందంలోని అధికారులు తెలిపారు.



ఆశ్రమంలోని వృద్ధులు



పరిశీలిస్తున్న మంత్రి సామినాథన్

విగ్రహాల పనులు పరిశీలించిన మంత్రి సామినాథన్

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని విళుపురం, ఈరోడు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న నాయకుల విగ్రహాల పనులను తమిళ అభివృద్ధి, సమాచారశాఖ మంత్రి సామినాథన్ మంగళవారం పరిశీలించారు. విళుపురం జిల్లాలో సామాజిక న్యాయ సంరక్షకుల విగ్రహాలు, ఈరోడు జిల్లా భవానిసాగర్‌లో ఉత్తమ త్యాగి ఈశ్వరన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని రాయపురంలో ఉన్న శిల్పశాలలో విగ్రహాల పనులు జరుగుతున్నాయి. వాటిని మంత్రి సామినాథన్ పరిశీలించి సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచించారు. వెంట తమిళ అభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, సమాచార ప్రజా సంబంధాలశాఖ సంచాలకులు వైద్యనాథన్ ఉన్నారు.

ఎన్‌కౌంటర్లపై విచారణకు సీపీఎం డిమాండ్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: 'ఎన్‌కౌంటర్' పేరుతో మరణశిక్ష విధించే అధికారం పోలీసులకు లేదని, ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ డిమాండ్ చేశారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో చెన్నైలో గత రెండున్నర నెలల్లో ముగ్గుర్ని ఎన్‌కౌంటర్ చేశారన్నారు. విచారణ జరపకుండా చంపడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. పోలీసుశాఖ చట్టాన్ని చేతిలోకి తీసుకోవడం సబబు కాదని ఖండించారు.

మైలాడుదురై జాలర్లను విడిపించాలి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మైలాడుదురైకు చెందిన 37 మంది జాలర్లను శ్రీలంకం నావికాదళం అరెస్టు చేసి పడవలను స్వాధీనం చేసుకుందని, వారిని వెంటనే విడుదల చేయాలని మూలాడుదురై కాంగ్రెస్ ఎంపీ ఆర్.సుధ కోరారు. ఈ మేరకు శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేకు లేఖ రాశారు. శ్రీలంక ద్వీపం సమీపంలో చేపలవేట సాగిస్తుండగా అక్కడికొచ్చిన శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిందన్నారు.

ప్రభుత్వ సహాయాల పంపిణీ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా నెమిలి సమీపంలోని మేళపులం పుదూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బుధవారం వినతిపత్రాల పరిష్కార శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరు చంద్రకళ పాల్గొని 436 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఫాతిమా, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాంచీపురం కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజావేదిక భవనంలో తమిళనాడు నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ తరఫున నాన్ ముదల్వన్ పథకం కింద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టరు కలైసెల్వి. చిత్రంలో సీఈఓ వి.వెట్రిసెల్వి, అధికారులు - కాంచీపురం, న్యూస్‌టుడే

చేనేత కార్మికులు, డిజైనర్లకు నగదు పురస్కారాలు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రస్తుత మార్కెట్ అవసరాలకు తగ్గట్లు పట్టు, చేనేత రకాలను తయారుచేసి నేత కార్మికుల సహకార సంఘాల అభివృద్ధికి అండగా ఉన్నవారిని ప్రోత్సహించేలా, జౌళి రంగంలో మారుతున్న ఆధునిక అభిరుచుల మేరకు కొత్త డిజైన్లు రూపొందిస్తున్న డిజైనర్లను ప్రోత్సహించేలా పురస్కారాలను, నగదు బహుమతిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఆ మేరకు 2023-24వ ఏడాదికిగాను 12 మందికి రూ.22.65 లక్షల నగదు బహుమతిని ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో బుధవారం అందించారు. పట్టు రకానికి ఉత్తమ నేత కార్మికుల పురస్కారాల్లో కాంచీపురం అరిజ్ఞర్ అన్నా పట్టు చేనేత కార్మిక సహకార సంఘం సభ్యుడు చంద్రశేఖరన్‌కు తొలి బహుమతి, పుగళేందికి మూడో బహుమతి, ఆరణి పట్టు చేనేత కార్మిక సహకార సంఘం సభ్యుడు కుమరేశన్ రెండో బహుమతి, పత్తి రకానికి ఉత్తమ కార్మిక పురస్కారాల్లో తొలి బహుమతిని పరమకుడిలోని మదర్ థెరిస్సా మహిళా చేనేత కార్మికుల సహకార సంఘం సభ్యులు ప్రేమ, రెండో బహుమతిని పరమకుడిలోని లోకమాన్య తిలకర్ చేనేత కార్మికుల సహకార సంఘం సభ్యులు అలమేలు, మూడో బహుమతిని కోయంబత్తూర్‌లోని వదంబచేరి శ్రీ నటరాజర్ చేనేత కార్మికుల సహకార సంఘం సభ్యులు మహాలక్ష్మీ, ఉత్తమ డిజైనర్ పురస్కారాల్లో తొలి బహుమతిని కాంచీపురం మురుగన్ పట్టు చేనేత కార్మికుల సహకార సంఘం సభ్యులు కుమరవేల్, రెండో బహుమతిని కాంచీపురం అరిజ్ఞర్ అన్నా పట్టు చేనేత కార్మికుల సహకార సంఘం డిజైనర్ పార్తిబన్, మూడో బహుమతిని తంజై పెరియార్ పట్టు, పత్తి చేనేత కార్మికుల సహకార సంఘం సభ్యులు కమలవేణి, ఉత్తమ యువ డిజైనర్ పురస్కారాల్లో తొలి బహుమతిని కరూర్‌లోని వళ్లువర్ సైన్స్, అగ్రికల్చర్ కళాశాల విద్యార్థిని దర్శన, రెండో బహుమతిని మదురైకు చెందిన శంకర్, మూడో బహుమతిని కోయంబత్తూర్‌లోని పీఎస్‌జీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థిని హరిణి అందుకున్నారు. మంత్రి గాంధీ, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం, చేనేత, జౌళి, ఖాదీ శాఖ ముఖ్యకార్యదర్శి ధర్మేంద్ర ప్రతాప్ యాదవ్, చేనేతశాఖ సంచాలకులు షణ్ముగసుందరం తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పురస్కార గ్రహీతలు

పీటీ రాజన్ వర్ధంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై ప్రావిన్స్ మాజీ ముఖ్యమంత్రి, జస్టిస్ పార్టీ నేతల్లో ఒకరైన దివంగత తమిళవేళ్ పీటీ రాజన్ 50వ వర్ధంతి సందర్భంగా 'తమిళవేళ్ పీటీ రాజన్ నినైవుగళిల్ 50' పేరిట డిజిటల్ ప్రత్యేక సంచికను రూపొందించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం ఆవిష్కరించారు. వెంట మంత్రులు దురైమురుగన్, పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, ప్రత్యేక సంచిక రూపకర్త శివప్రకాశం ఉన్నారు. పీటీ రాజన్ గురించి డిజిటల్ ప్రత్యేక సంచికలోని తన సందేశాన్ని 'ఎక్స్' పేజీలో ముఖ్యమంత్రి పంచుకున్నారు.



జలపాతంలో ప్రవహిస్తున్న నీరు

హొగినేకల్‌కు పెరిగిన నీటిరాక

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ధర్మపురి జిల్లా హొగినేకల్ కావేరి నదికి గత వారం రోజులుగా నీటి రాక చాలా వరకు తగ్గింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కర్ణాటక, తమిళనాడు కావేరి జలవనరుల ప్రాంతాలైన అంజెట్టి, కేరట్టి, నాట్రాంపాలయం తదితర ప్రాంతాల్లో బారీ వర్షం కురిసింది. దీంతో హొగినేకల్‌కు బుధవారం ఉదయం 5 వేల ఘనపుటడుగులకు నీరు చేరుతోంది. పర్యాటకులు ప్రధాన జలపాతం, కావేరి నదిలో ఉత్సాహంగా స్నానాలు చేశారు. పిలిగుండుల్లో నీటి ప్రవాహాన్ని కేంద్ర జలవనరుల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు తిల్లై గంగా నగర్, సిడ్కో-తిరుముల్లైవోయల్, పెరియార్ నగర్ ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు.

క్షమాపణ తెలిపిన విమాన సంస్థ

వడపళని: చెన్నై నుంచి దుబాయికి వెళ్లాల్సిన విమానం ఇంజిన్ నుంచి పొగ వ్యాపించి ఆలస్యంగా బయలుదేరడంతో ప్రయాణికులకు 'ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్' సంస్థ క్షమాపణ చెప్పింది... వివరాలు... 'ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్' సంస్థ విమానం ఈకే547 మంగళవారం రాత్రి 9.40 గంటలకు దుబాయి బయలుదేరేందుకు సిద్ధమైంది. ఇంజిన్ నుంచి పొగ రావడాన్ని గమనించిన గ్రౌండు సిబ్బంది పైలట్‌ను అప్రమత్తం చేశారు. పైలట్ వెంటనే ఇంజిన్‌ను ఆపివేశారు. అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. విమానంలో ఉన్న ప్రయాణికులను జాగ్రత్తగా బయటికి పంపామని అధికారి తెలిపారు. ఇంజినీర్ల బృందం పరిశీలించి క్లియరెన్సు ఇచ్చిన తర్వాత విమానం దుబాయికి ఆలస్యంగా బయలుదేరిందని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులకు జరిగిన అసౌర్యానికి చింతిస్తూ ఎమిరేట్స్ సంస్థ క్షమాపణ తెలియజేసింది.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత

పెరియపాళ్యం, న్యూస్‌టుడే: పెరియపాళ్యం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం తరపున విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేసే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గోవిందరాజన్ ముఖ్య అతిథిగా హాజరై పెరియపాళ్యం, కన్నిగైప్పేర్ పాఠశాలలకు చెందిన 225 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. డీఎంకే రాష్ట్ర సర్వసభ్య సభ్యుడు మూర్తి, ప్రధానోపాధ్యాయులు పేరిన్బసెల్వి, సంపత్ పాల్గొన్నారు.



సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

ఆది ద్రావిడ సంక్షేమ పథకాలపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: ఆది ద్రావిడ సంక్షేమ పథకాలు, వాటి అమలు, పనితీరు గురించి సమీక్షా సమావేశం బుధవారం తమిళనాడు ఆది ద్రావిడ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమావేశాలు హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి కయళ్విలి సెల్వరాజ్ అధ్యక్షత వహించారు. అన్ని జిల్లాల ఆదిద్రావిడ సంక్షేమశాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొనగా మంత్రి కయళ్విలి సెల్వరాజ్ సంక్షేమ పథకాల అమలు, పనితీరు గురించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధితశాఖ ప్రభుత్వ కార్యదర్శి లక్ష్మీప్రియ, డైరెక్టర్ ఆనంద్, థాడ్కో మేనేజింగ్ డైరెక్టర్ కందసామి, గిరిజన సంక్షేమ డైరెక్టర్ అన్నాదురై, అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మంత్రి కయళ్విలి సెల్వరాజ్, అధికారులు

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేరుస్తాం


ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి దిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల డిమాండ్లలో కొన్నింటిని నెరవేరుస్తామని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తిరుచ్చి సత్రం బస్టాండ్ నుంచి సర్క్యులర్ రూట్ బస్సు సేవలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ...చెన్నైకు తదుపరి తిరుచ్చి, మదురై, కోవై నగరాల అభివృద్ధి చెందాయన్నారు. ముఖ్యంగా తిరుచ్చిలో పంజపూర్ ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్, అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయులు త్రైమాసిక పరీక్షా సెలవులను పొడిగించాలని కోరుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల 31 డిమాండ్లలో 12 డిమాండ్లను తాము నెరవేరుస్తామని తెలిపామని చెప్పారు. పాఠశాల విద్యాశాఖకు కేంద్రం నిధులు ఇవ్వాలని కోరేందుకు ముఖ్యమంత్రి 27న ప్రధానిని కలిసేందుకు దిల్లీ వెళ్తున్నారని తెలిపారు. తిరిగి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల డిమాండ్లను నెరవేరుస్తామని పేర్కొన్నారు.



బస్సులు ప్రారంభిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

సంక్షోభం పేరుతో నియామకాలు ఆపటమా?:అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: ఆర్థిక సంక్షోభంతో ఉపాధ్యాయ నియామకాలు ఆపేసినట్లు వార్తలు వచ్చాయని, ఇదే నిజమైతే ఖండించదగిందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండటంతో సెకండరీ ఉపాధ్యాయుల నుంచి కళాశాలల అసిస్టెంట్ ప్రొఫెసర్ల వరకు నియామకాలు నిలుపుదల చేస్తున్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు. ఈ విషయంలో తమిళనాడు ప్రభుత్వం నిర్లక్ష్యం వహించటం తగదని అన్నారు. ఉమ్మడి విద్యా పథకం కింద ఇవ్వాల్సిన నిధులను కేంద్రం ఇవ్వకపోవడం సమస్యకు కారణమని చెప్పబడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గొడవతో విద్యార్థుల చదువు దెబ్బతినకూడదని తెలిపారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఏవీ వేలు

సభాస్థలం పరిశీలన

అరక్కోణం, న్యూస్‌టుడే: ఈ నెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పనపాక్కం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారు. సభా స్థలం వద్ద జరుగుతున్న పనులను పబ్లిక్ వర్క్స్, హైవేలు, ఓడరేవులు, మంత్రి ఏవీ వేలు పరిశీలించారు. కార్యక్రమంలో రాణిపేట జిల్లా కలెక్టరు చంద్రకళ, నెమిలి యూనియన్ అధ్యక్షులు రవీంద్రన్, పెరుమాళ్, అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu



గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న చాందిని

తెలుగు విద్యార్థినికి స్వర్ణపతకం

టీనగర్, న్యూస్‌టుడే: మద్రాసు యూనివర్సిటీలో ఎమ్మెస్సీ మెడిసిన్-మెడికల్ మైక్రోబయాలజీ చదివిన తెలుగు విద్యార్థిని చాందిని కళాకరన్ స్వర్ణపతకం అందుకున్నారు. మంగళవారం జరిగిన మద్రాసు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆమె గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా పతకం అందుకున్నారు. కళాకరన్, తారకలక్ష్మి దంపతుల కుమార్తె చాందిని నగరంలోని మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో యూజీ, మద్రాసు విశ్వవిద్యాలయంలో పీజీ చేశారు. ఇదివరలో పరిశోధనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అవార్డు పొందారు.

పళని పంచామృతంపై అనుచితవ్యాఖ్యలు
సినీ దర్శకుడు, భాజపా నిర్వాహకుడిపై ఫిర్యాదు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పళని మురుగన్ ఆలయంలో భక్తులకు ప్రసాదంగా ఇస్తున్న పంచామృతంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భాజపా నిర్వాహకుడు సెల్వకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పంచామృతం తయారీకి ఏఆర్ డెయిరీ ఫుడ్స్ నెయ్యి వాడుతున్నట్లు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ● పంచామృతంపై అనుచితవ్యాఖ్యలకు సినీ డైరెక్టర్ మోహన్‌పై కేసు నమోదవగా చెన్నైలో మంగళవారం తిరుచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచగా బెయిల్‌పై విడుదల చేశారు. మరోవైపు పళని దేవస్థానం ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారని చెప్పారన్నారు. తమిళనాడులోనూ అలాగే జరిగి ఉండొచ్చని, సరి చేయాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడానని తెలిపారు.

రికార్డు సాధించిన విద్యార్థినికి అభినందన

చెన్నై, న్యూస్‌టుడే: ఏకకాలంలో రెండు చేతులు ఉపయోగించి రెండు విన్యాసాలతో రికార్డులు సృష్టించిన తిరునెల్వేలి జిల్లాకు చెందిన శాంతా షర్మిలను ముఖ్యమంత్రి స్టాలిన్ అభినందించారు. ఏకకాలంలో రెండు చేతులు ఉపయోగించి 5 నిమిషాల్లో 12 తిరుకురళ్ సూక్తులను రాసి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో, ఏక కాలంలో రెండు చేతులను ఉపయోగించి ఒక నిమిషంలో 14 మిర్రర్ ఇమేజ్ తమిళ అక్షరాలను రాసి 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో శాంతా షర్మిల చోటు పొందారు. ఈ సందర్భంగా ఆమె తన తల్లిదండ్రులతో కలిసి బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి తనకు అందించిన ప్రశంసాపత్రాలను చూపించారు. ఆమెను ముఖ్యమంత్రి అభినందించారు.

ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణుల వినూత్న ఆందోళన

విల్లివాక్కం: ఉపాధ్యాయ అర్హత పరీక్షలో 2013లో ఉత్తీర్ణత పొందిన వారిని ఇప్పటి వరకు ఉపాధ్యాయులుగా నియమించలేదు. మరోవైపు అర్హత పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారికి నియామక పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది సరికాదని 11 ఏళ్లుగా ఉపాధ్యాయ అర్హత పొందిన వారు ఆందోళన చేపడుతున్నారు. బుధవారం ఈరోడ్ కొత్తమాలనాడు వినాయక విగ్రహం సమీపాన ఈరోడ్, కోవై, తిరుప్పూర్, సేలం, ధర్మపురి తదితర జిల్లాలకు చెందిన 300 మందికిపైగా చెవుల్లో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా ఆందోళన చేపట్టారు.

వాహనాలు నిలిపేందుకు టీవీకే వినతి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం తొలి రాజకీయ మహానాడు అక్టోబరు 27న విళుపురం జిల్లా విక్రవాండి సమీపంలో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. మహానాడు ప్రాంగణంలో అగ్నిమాపక వాహనం, అంబులెన్స్ నిలపడానికి, రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు పార్టీ ప్రతినిధులు బుధవారం వినతిపత్రాలు అందించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



నమూనా తాళం చెవి అందిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ అన్నారు. పూందమల్లి సమీప కరికలవాక్కం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.2.57 కోట్ల వ్యయంతో నిర్మించిన 5 కొత్త భవనాలను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఆరోగ్యశాఖకు అధిక నిధులు కేటాయించిన ఘనత తమిళనాడేనని పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రశంసాపత్రం అందించిందన్నారు. తిరువళ్ళూరులో కొత్తగా నెలకొల్పిన వైద్య కళాశాలకు రూ.60 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన బస్సు నమూనా తాళంను డీన్‌కు మంత్రి అందజేశారు. రాష్ట్ర ఖద్దరు శాఖ మంత్రి గాంధీ, ఎమ్మెల్యేలు నాజర్, కృష్ణస్వామి, జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

ఖోఖో పోటీల్లో ప్రతిభ

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా వండలూర్ సమీప రత్తిన మంగళంలోని గిరీష్ ఇంటర్నేషనల్ పాఠశాలలో సీబీఎస్ఈ క్లస్టర్ పాఠశాలలకు జాతీయస్థాయి ఖోఖో పోటీలను నిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్, ఆంధ్రప్రదేశ్ నుంచి 800 పాఠశాలలకు చెందిన 10 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. 19 ఏళ్ల విద్యార్థుల విభాగంలో ఎన్‌కేవీ విద్యాలయ పాఠశాల, 17 ఏళ్ల విభాగంలో కోవూర్ శ్రీగిరీష్ ఇంటర్నేషనల్ పాఠశాల, 14 ఏళ్ల విభాగంలో వేలమ్మాళ్ విద్యాలయం మొదటిస్థానంలో నిలిచాయి. విజేతలకు తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ సుందర్, పాఠశాల ప్రిన్సిప్ ఆర్.కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ అధికారి జయ కార్తిక్ బుధవారం బహుమతులు అందించారు.



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

కుల గణన చేపట్టాలని ఆందోళన

వేలూర్, న్యూస్‌టుడే: కుల గణన చేపట్టాలని కోరుతూ బీసీ, ఎంబీసీ సంక్షేమ సంఘాలకు చెందిన వారు వేలూర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ అధ్యక్షత వహించారు. కుల గణన చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. సంఘ వ్యవస్థాపకుడు సభాపతి, జిల్లా అధ్యక్షుడు మురళీధరన్ పాల్గొన్నారు.

అధికార భాషపై దక్షిణ రైల్వేలో సమావేశం



పుస్తకావిష్కరణలో కౌశల్ కిశోర్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: జోనల్ అఫిషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ(జడ్ఓఎల్ఐసీ) ఆధ్వర్యంలో దక్షిణ రైల్వేలో బుధవారం 175వ సమావేశం జరిగింది. అదనపు జనరల్ మేనేజరు కౌశల్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్, టెలికమ్యూనికేషన్ ఇంజినీరు శైలేష్ కుమార్ తివారి, చీఫ్ అఫిషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ సి.ఎం.రవి, సీనియర్ అధికారి బినిటా సాయ్ తదితరులు పాల్గొన్నారు. ప్రాంతీయ భాషలతో పాటు అధికార భాషను కూడా ప్రాచుర్యంలోకి తీసుకురావాలన్నది కేంద్రం ఆలోచన అని కౌశల్ కిశోర్ అన్నారు. దక్షిణ రైల్వేలోని అధికార భాషా విభాగం రూపొందించిన 'డైట్ ఫర్ ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్' పుస్తకాన్ని కౌశల్ కిశోర్ ఆవిష్కరించారు. రైల్వే ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చే వారికి అర్థమయ్యేందుకు తమిళం, హిందీ, ఆంగ్ల భాషల్లో కూడా ప్రచురితమైందని తెలిపారు.

సబ్ ఇన్‌స్పెక్టరు సస్పెన్షన్

ప్యారిస్, న్యూస్‌టుడే: మోడ్రన్ కంట్రోల్ రూమ్‌కి చెందిన సబ్ ఇన్‌స్పెక్టరు నవనీత కృష్ణన్ ఈ నెల 21న రాత్రి గస్తీ పనులు చేపట్టారు. అప్పుడు వాహనాల తనిఖీ సమయంలో ద్విచక్ర వాహనంలో వచ్చిన వ్యక్తి వద్ద సరైన పత్రాలు లేవని జీ పే ద్వారా నగదు తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అనంతరం ఈ విషయమై దర్యాప్తు చేసి నవనీతకృష్ణన్‌ను అధికారులు సస్పెండు చేశారు.

విత్తనాలు వెదజల్లిన విద్యార్థులు



విత్తనాలు విసురుతున్న విద్యార్థినులు

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ దొరప్పాడిలోని అడవి విస్తరణకు సదరు శాఖ అధికారులు పథకం రూపొందించారు. ఈ మేరకు అడవిలో లక్ష వివిధ రకాల విత్తనాలు వెదజల్లే బృహత్తర పథకం బుధవారం ప్రారంభమైంది. సామాజిక సేవకుడు దినేష్ నేతృత్వంలో స్థానిక ముత్తురంగ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, డీకేఎం మహిళా కళాశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు, వివిధ స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు విత్తనాలు చల్లారు. ఎమ్మెల్యే కార్తిగేయన్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, మేయర్ సుజాత పాల్గొన్నారు.

పారాలింపిక్స్ విజేతలకు ప్రోత్సాహక నగదు

చెన్నై, న్యూస్‌టుడే: పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్రానికి చెందిన నలుగురు క్రీడాకారులకు ప్రోత్సాహక నగదుగా రూ.5 కోట్ల విలువైన బ్యాంకు చెక్కులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందించారు. బాడ్మింటన్‌లో రజత పతకం గెలిచిన తులసిమతికి రూ.2 కోట్లు, కాంస్య పతకం గెలిచిన నిత్యశ్రీ, మనీషా, హైజంప్‌లో కాంస్య పతకం గెలిచిన మరియప్పన్‌కు రూ.కోటి చొప్పున బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అందించారు. మంత్రి ఉదయనిధి, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ సభ్య కార్యదర్శి మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చేరిన పుదువై మంత్రి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి హోంశాఖ మంత్రి నమశ్శివాయం కొద్దిరోజులుగా జ్వరం, జలుబుతో ఇబ్బందిపడుతున్నారు. ఆయన మూలకులంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. చికిత్స పొందాలని వైద్యులు సూచించడంతో బుధవారం ఆస్పత్రిలో చేరారు. పరీక్షల్లో సాధారణ జలుబు, జ్వరం ఉందని తేలింది. కొద్దిరోజులుగా పుదుచ్చేరిలో డెంగీ, గన్యా జ్వరాలు అధికమవుతున్నాయి.

ఆత్మహత్య కేసులో సెల్‌ఫోన్ విషయమై సీబీసీఐడీ ఆరా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కొడనాడులో ఆత్మహత్యకు పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్ దినేష్ వినియోగించిన సెల్‌ఫోన్ విషయమై ఆయన తండ్రి వద్ద సీబీసీఐడీ పోలీసులు వివరాలు సేకరించారు. బుధవారం కోత్తగిరి సమీపంలోని దినేష్ ఇంటికి వెళ్లి ఆయన తండ్రి భోజన్‌తో మాట్లాడారు. కుమారుడు ఆత్మహత్య చేసుకొని ఏడేళ్లు కావడంతో సెల్‌ఫోన్ గురించి తనకేమీ తెలియదని చెప్పినట్లు తెలిసింది.

భార్యపై నటుడు జయం రవి ఫిర్యాదు

ప్యారిస్, న్యూస్‌టుడే: భార్యపై నటుడు జయం రవి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. జయం రవి తన భార్య ఆర్తితో విడిపోతున్నట్లు ప్రకటించి కోర్టులో విడాకుల కేసు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో భార్య ఆర్తిపై అడయారు డిప్యూటీ కమిషనరు కార్యాలయంలో చేసిన ఫిర్యాదులో చెన్నై ఈసీఆర్ సాలైలో ఉన్న ఆర్తి ఇంట్లో ఉన్న తన వస్తువులు అప్పగించాలని కోరారు. విడాకులు చర్చనీయాంశమైన నేపథ్యంలో భార్య ఆర్తిపై ఫిర్యాదు చేయడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

రౌడీల అరెస్టుకు చర్యలు

ప్యారిస్, న్యూస్‌టుడే: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత చెన్నైలో రౌడీల వేట తీవ్రమైంది. ఈ నేపథ్యంలో పరారిలో ఉన్న రౌడీలు సంభవ సెంథిల్, పామ్ శరవణన్‌లను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సంభవ సెంథిల్ థాయ్‌లాండ్‌లో ఉన్నట్లు సమాచారం వచ్చిన స్థితిలో పామ్ శరవణన్ ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయినట్లు తెలుస్తోంది. వారు ఉన్న ప్రాంతాలను గుర్తించేందుకు వారి స్నేహితులు, బంధువులను పోలీసులు రహస్యంగా పర్యవేక్షిస్తున్నారు. వారికి సన్నిహితులు ఎవరు అనే విషయాన్ని గుర్తించేందుకు వారి సెల్‌ఫోన్ నెంబర్లు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

గిండీలో ఉద్యోగ మేళా 27న

వడపళని, న్యూస్‌టుడే: 'డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ సెంటర్స్' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేటు సంస్థల ఉద్యోగ మేళా జరగనుంది. గిండీ ఎస్టేట్‌లోని కెరీర్ గైడెన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇరవైకి పైగా ప్రైవేటు సంస్థలు ఇందులో పాల్గొనే అవకాశాలున్నాయని వివరించారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చు. ఔత్సాహికులు ముందుగా తమిళనాడు ప్రైవేట్ సెక్టార్ జాబ్ వెబ్‌సైట్ www.tnprivatejobs.tn.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలి.

19 మంది మహిళా పోలీసుల బదిలీ

ప్యారిస్, న్యూస్‌టుడే: గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ 19 మంది మహిళా పోలీసులను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మహిళా సిబ్బంది ప్రసూతి సెలవులు పూర్తయిన తర్వాత విధులకు హాజరయ్యే సమయంలో వారి పిల్లలను పరామర్శించేందుకు వీలుగా వారి తల్లిదండ్రులు లేదా భర్త కుటుంబీకులు ఉండే జిల్లాల్లో రాబోయే మూడేళ్లకు బదిలీ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఆ మేరకు చెన్నైలో విధులు నిర్వహించే 19 మందిని వారికి నచ్చిన జిల్లాలకు బదిలీ చేశారు.

నిందితుడి దారుణ హత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ సమీపంలోని కాప్పిలియపట్టికి చెందిన పళనిసామి కుమారుడు దీనదయాలన్‌వర్మన్(32) సెల్‌ఫోన్ సర్వీస్ చేసే దుకాణం నడుపుతున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇతనిపై 2016లో ఓ హత్యకు సంబంధించి కేసు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో అమ్మాకులక్కరై ప్రాంతంలో బుధవారం ఉదయం దీనదయాలన్‌వర్మన్‌ను దారుణంగా నరికి చంపిన స్థితిలో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వడమదురై పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించి విచారణ చేపట్టారు. పాతకక్షల కారణంగా హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



దీనా

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్ళూరు సమీప తండలానికి చెందిన శేఖర్ కుమారుడు దీనా(16) ఎనిమిదో తరగతి వరకు చదివాడు. ఇతడు మంగళవారం రాత్రి అరుణ్‌వాయల్‌లో జరిగిన వివాహ విందు కార్యక్రమంలో పాల్గొన్నాడు. కల్యాణ మండపంలో తెగి పడి ఉన్న తీగను తొక్కడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. బంధువులు అతనిని తిరువళ్ళూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: ఒడిస్సా రాష్ట్రం జగత్‌సింగ్‌పూర్‌కు చెందిన అసుదాస్ పారిక్(34) గుమ్మిడిపూండి సిప్కాట్ పారిశ్రామికవాడలోని కర్మాగారంలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతను అక్కడున్న భవనంపై నిలుచుని పనిలో నిమగ్నమై ఉండగా అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నరువి ఆసుపత్రుల వ్యవస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ జీవీ సంపత్ కుమారుడు నితిన్ సంపత్, అడయార్ ఆనంద్ భవన్ గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కేవీ వెంకటేశన్ కుమార్తె అభిరామిల వివాహం ఇటీవల చెన్నైలో జరిగింది. నూతన దంపతులు తల్లి దండ్రులతో కలిసి బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. చిత్రంలో అడయార్ ఆనంద్ భవన్ గ్రూపు సంస్థల డైరెక్టరు విష్ణు శంకర్ కూడా ఉన్నారు.

-న్యూస్‌టుడే, వడపళని

నగదు మోసం కేసులో ముగ్గురు అరెస్టు



అరెస్టయిన నిందితులు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ రివార్డు పేరుతో నగదు మోసానికి పాల్పడిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ఇలా... చెన్నై నుంగంబాక్కంకి చెందిన దేబేంద్రన్ నారాయన్‌కర్ గత నెల సైబర్ క్రైం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో...తన సెల్‌ఫోన్‌కు రూ.9,730 రివార్డు పేరుతో ఎస్ఎంఎస్ లింక్ వచ్చిందని, అది నిజం అనుకుని క్లిక్ చేసి తన అకౌంట్ నెంబరు తదితర వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం అతని ఖాతా నుంచి రూ.2.35 లక్షల నగదు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకున్నారని, ఈ విషయమై తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు ఉపయోగించిన బ్యాంకు ఖాతా, సెల్‌ఫోన్ నెంబరు ఆధారంగా దర్యాప్తు చేసి బిరుచౌదరి, బిజు చౌదరి, సురోనిత్‌సేన్‌ను పశ్చిమ బెంగాల్‌లో అరెస్టు చేసి, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

లైంగిక వేధింపులకు పాల్పడిన వైద్యుడు..



అనంతకృష్ణన్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా మరుదమలై సమీప ఐటీబీ కాలనీకి చెందిన అనంతకృష్ణన్ వైద్యుడు. మరుదమలై పర్వత కిందిభాగంలో బంగ్లా నిర్మించాడు. తేని జిల్లాకు చెందిన 23 ఏళ్ల యువతిని ఇంటీరియర్ డిజైనర్‌గా నియమించాడు. ఆమెను వైద్యుడు లైంగికంగా వేధించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కోవై మహిళా పోలీసులు దర్యాప్తు చేపట్టి అనంతకృష్ణన్‌ను బుధవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచి కోవై కేంద్ర కారాగారానికి తరలించారు.

తిరుప్పూర్‌లో ఆరుగురు...

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్‌లో తగిన పత్రాలు లేకుండా తిరుగుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగర ప్రాంతంలోని బనియన్ కంపెనీల్లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన అనేకమంది కార్మికులుగా పనిచేస్తున్నారు. పోలీసులు బుధవారం సెంట్రల్ బస్టాండ్ ప్రాంతంలో తిరుగుతున్న ఉత్తరాది కార్మికుల వద్ద ఆధార్, ఇతర పత్రాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురి వద్ద ఎలాంటి ఆధారపత్రాలు లేవని గుర్తించారు. పశ్చిమబెంగాల్‌కు చెందినవారుగా గుర్తించారు. సెంట్రల్‌బస్టాండ్ వద్ద కంపెనీలో చేరేందుకు వచ్చినప్పుడు పోలీసులకు దొరికారు. పోలీసులు అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గుట్కా తరలిస్తున్న ముగ్గురు...

రెడ్‌హిల్స్: తిరుత్తణి సీఐ మదిఅరసన్ నేతృత్వంలో పోలీసులు వళ్లిమాపురంలో వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న 30 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకుని అరక్కోణానికి చెందిన సతీష్, జైకిషోర్, సుమన్‌ను అరెస్టు చేశారు.

80 కిలోలు స్వాధీనం

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి సమీప ఆరంబాక్కంలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తడ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఓ ఆటోలో సోదా నిర్వహించారు. పది బస్తాల్లోని 80 కిలోల పాన్‌పరాగ్, హాన్స్, మావా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని చెన్నై ఫ్లవర్స్ రోడ్డుకు చెందిన మాలతి, ఆటో డ్రైవర్ దామోదరన్‌ను అరెస్టు చేశారు.

చోరీ కేసులో మెకానిక్...



దేవకుమార్

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ జిల్లా కాట్పాడి గాంధీనగర్‌కు చెందిన దేవకుమార్ వెంకటేశపురంలో మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. ఇతను చోరుల నుంచి కార్లను కొనుగోలు చేసి రంగుల మార్చి విక్రయిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదులు అందాయి. డీఎస్పీ పళని, సీఐ ఆనందన్‌తో కూడిన ప్రత్యేక పోలీసు బృందం దర్యాప్తు చేపట్టగా దేవకుమార్ 54 కార్లను కొనుగోలు చేసి విక్రయించనట్లు తేలింది. దీంతో అతనిని బుధవారం అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యూటీపార్లర్లో వ్యభిచారం..

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు వాణియంబాడి రోడ్డులో సేలానికి చెందిన తమిళ్‌సెల్వన్ కేశ సౌందర్య కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఇతను పొరుగు రాష్ట్రాలకు చెందిన మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టి ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని ప్రభుత్వ హోంకు తరలించారు. తమిళ్‌సెల్వన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించారు.

విద్యార్థిని ఆత్మహత్య అల్లర్ల కేసులో మేనమామ..

వేళచ్చేరి,న్యూస్‌టుడే: కళ్లకురిచ్చి సమీప కనియమూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో చదివిన విద్యార్థిని 2022లో ఆత్మహత్య చెందింది. ఆ సమయంలో పెద్ద ఎత్తున అల్లర్లు చోటు చేసుకొన్నాయి. ఈ ఘటనపై పోలీసులు పలువురి వద్ద విచారణ జరిపారు. అల్లర్లలో బాలిక మేనమామ మురుగన్(47) 3వ నిందితుడని తెలియడంతో పోలీసులు సమన్లు పంపినా విచారణకు హాజరు కాకపోవడంతో బుధవారం అరెస్టు చేసింది. విచారణ కోసం కళ్లకురిచ్చికి తీసుకొచ్చారు.

బాలుడి హత్య కేసులో జీవిత ఖైదు

ప్యారిస్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం కారణంగా ఐదేళ్ల బాలుడిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తేని కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తేనిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి వద్ద 2019లో బాలుడు గీత, మురుగన్‌ల ఐదేళ్ల కుమారుడు హరీష్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా గీత భర్తతో విడిపోయి ఐదేళ్ల కుమారుడు హరీష్‌తో ఒంటరిగా ఉంటున్నట్లు తెలిసింది. ఆమెకు స్థానికంగా ఉంటున్న కార్తిక్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గీత ఇంటికి కార్తిక్ వెళ్లినప్పుడల్లా ఆమె కుమారుడు ఇబ్బందిగా ఉండడంతో కార్తిక్ బాలుడిని రంగనాదపురం ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతంలో ఉన్న శ్మశానం వద్దకు తీసుకెళ్లి, ఇటుకరాయితో తలపై కొట్టి హత్య చేశాడు. పోలీసులు కార్తిక్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు తేని జిల్లా కోర్టులో నడిచింది. విచారణ పూర్తి కావడంతో కార్తిక్‌ను దోషిగా నిర్ధారించి జీవితఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అనంతరం అతనిని మదురై సెంట్రల్ జైలుకు తరలించారు.

సిట్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అగ్నిప్రమాదం

ప్యారిస్, న్యూస్‌టుడే: విరుదునగర్ అళగాపురి రోడ్డులో ఉన్న సిట్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శివకాశికి చెందిన బాలాజీ పాలథిన్ కవర్ ప్రింటింగ్ కర్మాగారం నిర్వహిస్తున్నాడు. అందులో 20 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కర్మాగారంలోని ఓ యంత్రంలో అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం ఏర్పడింది. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీశారు. ఈ విషయమై సమాచారం అందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ దగ్ధం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ వెళ్లియనై సమీపంలో ఉన్న కాట్టేరిగౌంటర్ ప్రాంతానికి చెందిన కనకరాజ్ కుమారుడు దినేష్‌కుమార్ ఈ ఏప్రిల్‌లో కొత్తగా విద్యుత్తు స్కూటర్ కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్లియనై నుంచి సేలం శివారు రోడ్డు మార్గంలో వెళుతున్నాడు. ఆ సమయంలో స్కూటర్ నుంచి పొగ రావడాన్ని గుర్తించి పక్కన నిలిపాడు. మంటలు వ్యాపించి వాహనం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న కరూర్ అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైళ్లలో ఖైదీల ఆత్మహత్య
ఇద్దరు సిబ్బంది సస్పెన్షన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి, కారైక్కాల్ జైళ్లలో ఖైదీలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలకు సంబంధించి ఇద్దరు జైలు సిబ్బంది సస్పెండ్ చేశారు. పుదుచ్చేరిలో మార్చిలో తొమ్మిదేళ్ల బాలికపై హత్యాచారానికి పాల్పడిన కేసులో అరెస్టైన వివేకానందన్(57) పుదుచ్చేరి జైల్లో ఉన్నాడు. ఇతను 16న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంతకు ముందు కారైక్కాల్ జైల్లో ఉన్న విచారణ ఖైదీలు విల్లియనూర్‌కు చెందిన ప్రతీష్(26) జూన్ 11న ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనల్లో విధుల్లో ఉండి నిర్లక్ష్యంగా వ్యవహరించిన జైలు పోలీసులపై చర్యలకు జిల్లా నిర్వాహకులు సిఫార్సు చేసింది. వివేకానందన్ ఆత్మహత్య సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ ముత్తుకుమరన్, కారైక్కాల్ జైల్లో ప్రతీష్ ఆత్మహత్య సమయంలో విధుల్లో ఉన్న పోలీస్ రామన్‌ని సస్పెండ్ చేస్తు జైళ్లశాఖ ఐజీ రవిదీప్‌సింగ్ సాగర్ బుధవారం ఆదేశించారు.



ఎర్ర చందనం దుంగలు

ఎర్రచందనం పట్టివేత

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నైకి మినీలారీ ద్వారా అక్రమంగా తరలిస్తున్న రూ.50 లక్షల విలువ చేసే ఎర్ర చందనాన్ని తిరుత్తణి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం తిరుత్తణి సమీపంలోని తిరుపతి జాతీయ రహదారిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుత్తణికి వస్తున్న ఓ వ్యానులో తనిఖీ చేయగా సుమారు రెండు టన్నుల బరువున్న ఎర్రచందనం ఉండడాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్న నిందితులను ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు చెందిన గణేశన్(45), జోతీశ్వర్ రెడ్డి(44)గా గుర్తించి అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

అధికారులు స్వతంత్రంగా పని చేయాలి: భాజపా

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రత్యేక పథకాల అమలు అధికారులు రాజకీయ జోక్యం లేకుండా పనిచేసే పరిస్థితులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తమిళనాడు భాజపా కోరింది. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో. . ప్రత్యేక పథకాల అధికారులు ఆయా జిల్లాల్లో అమలు చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పని చేయాలన్నారు.

పార్వతమ్మ మృతిపై సంతాపం

టీనగర్, న్యూస్‌టుడే: లోక్‌సభ మాజీ సభ్యుడు మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి, ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతిపై అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు సీఎంకే రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో.. దశాబ్దాలుగా మాగుంట కుటుంబం తెలుగు జాతికి అనేక సేవలందించినట్లు గుర్తు చేశారు. ఆమె పవిత్రాత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

కార్మికుడికి గాయాలు

శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే: శ్రీపెరుంబుదూర్ సమీప చెంబరంబాక్కం ప్రాంతంలో ఈవీపీ ఫిలిం సిటీలో బిగ్ బాస్ సెట్టింగ్ నిర్మాణాలు సాగుతున్నాయి. పనుల్లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పలువురు కార్మికులు పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సాయిన్ ఖాన్(47) బుధవారం బిగ్ బాస్ సెట్ నిర్మాణంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో తీవ్రగాయాల పాలయ్యాడు. సహచర కార్మికులు తండంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నసరత్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu